క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న పాల్వాయి హరీశ్‌బాబు

సిర్పూర్(టి): మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన టాక్రె భిక్కు రెండు రోజుల క్రితం గ్రామ శివారులో పిడుగుపడి మృతి చెందగా సోమవారం బాధిత కుటుంబాన్ని నియోజకవర్గ బీజేపీ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు పరామర్శించారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి ఆర్థిక సాయం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్ములే శంకర్, నాయకులు మహేశ్ యాదవ్, సాయి, గ్రామస్తులు ఉన్నారు.

'బెల్టుషాపులతో రోడ్డున పడుతున్న కుటుంబాలు'

కాగజ్‌నగర్‌టౌన్: బెల్టుషాపులతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోలెం వెంకటేశం అన్నారు. సోమవారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా క్షేమం ఆలోచించని ప్రభుత్వానికి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. బెల్టుషాపులను యథేచ్ఛగా నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

'పఠనోత్సవం' ప్రారంభం



విద్యార్థితో చదివిపిస్తున్న హెచ్‌ఎం

కెరమెరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం పఠనోత్సవ కార్యక్రమాన్ని ఉదయం 10 గంటలకు ప్రధానోపాధ్యాయులు ప్రారంభించారు. ఎస్‌ఎంసీ చైర్మన్లు, ఎస్‌ఎంసీ సభ్యులు, తల్లిదండ్రుల ఎదుట విద్యార్థులతో పాఠాలు చదివించారు. ఈ సందర్భంగా పఠనోత్సవ కార్యక్రమ ప్రాధాన్యత వివరించారు. కార్యక్రమంలో ఎంఎన్‌వో ఆడే ప్రకాశ్, గోయగాం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నల్లగొండ రమేశ్ ఉన్నారు.

డ్రెయినేజీలో పూడికతీత



పూడిక తీయిస్తున్న సర్పంచ్ రవి

బెజ్జూర్: వర్షం నీరు ఇళ్లలోకి చేరకుండా మండలంలోని చిన్నసిద్ధాపూర్ గ్రామ సర్పంచ్ రవి పలు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇళ్లలోకి నీరు రాకుండా సోమవారం జేసీబీ సహాయంతో డ్రెయినేజీలో పూడిక తీయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విఠల్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

కౌటాల: బ్యాంకు ఖాతాదారులు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని బ్యాంకు అధికారులు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని టీజీబీలో ఖాతాదారులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ డిజిటల్ సేవలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఖాతాదారులు బ్యాంకు సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు రాజేశ్, మనోహర్, లీలా, మోరేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బీపీ కిట్ అందజేత

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో తొమ్మిది మంది ఏఎన్‌ఎంలకు సోమవారం ఆస్పత్రి వైద్యాధికారి రాంబాబు బీపీ కిట్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. బీపీ, షుగర్ పరీక్షలు చేసేందుకు ఇది చాలా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో నాందేవ్, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, సత్తవ్వ, హిమ, అదీప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వర్షానికి కూలిన గోడ

నార్నూర్: మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలచ, కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం ఆరు నెలల క్రితమే పూర్తయింది. అయితే ప్రహరీ నాసిరకంగా నిర్మించడంతో రెండు రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వర్షానికి కూలిపోయింది. గోడ కూలిపోవడంతో పక్కనే ఉన్న రాథోడ్ దేవికాబాయి, రాథోడ్ సికిందర్ పొలంలో పత్తి విత్తనాలు కొట్టుకుపోయాయని వాపోయారు. కాంట్రాక్టు నిర్లక్ష్యంతో గోడ కూలిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

'ప్రైవేట్' దోపిడీ!



బుక్‌స్టాల్‌లో నోట్‌బుక్స్ కొనుగోలు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

- అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలు
- బుక్స్ నుంచి షూల దాకా విక్రయాలు
- నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూళ్లు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ జరుగుతోంది. ఎంత ఖర్చయినా పర్లేదు.. పిల్లలకు నాణ్యమైన చదువు అందించాలనే తల్లిదండ్రుల ఆశలే పెట్టుబడిగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు దోచుకుంటున్నాయి. భారీగా ట్యూషన్ ఫీజులు వసూలు చేయడమే కాకుండా విద్యార్థులకు కావాల్సిన సామగ్రిని కూడా విక్రయిస్తూ పాఠశాలలను అంగడి బజార్లుగా మార్చేస్తున్నాయి. జీవో 1కి తూట్లు పొడుస్తూ విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్నాయి. అయినా విద్యాశాఖ అధికారులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

బడిలో వ్యాపారం

జిల్లాలో 120 ప్రైవేట్ స్కూళ్లు ఉండగా, సుమారు 25,000 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఎల్‌కేజీ విద్యార్థికి ఏడాదికి రూ.14 వేల నుంచి రూ.17 వేలు వసూలు చేస్తుండగా, పదో తరగతి విద్యార్థికి రూ.50వేల వరకు వసూలు చేస్తున్నారు. కాగా విద్యాలయాల్లో విద్యార్థులకు సంబంధించిన సామగ్రి విక్రయించొద్దని ప్రభుత్వ జీవోలు చెబుతున్నాయి. కానీ వీటికి విరుద్ధంగా ప్రైవేట్ స్కూళ్లు వ్యవహరిస్తున్నాయి. ఆయా పాఠశాలల్లో ప్రత్యేక కౌంటర్లు పెట్టి విద్యార్థులకు కావాల్సిన యూనిఫాంతో పాటు పుస్తకాలు, పెన్నులు, షూ, టై, బెల్ట్ వంటి సామగ్రి విక్రయిస్తున్నారు. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ప్రైవేట్ దుకాణాల నుంచి కమీషన్లు తీసుకుని విద్యార్థులకు కావాల్సిన సామగ్రి తాము చెప్పిన చోటే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయి. ఓ వైపు ఫీజుల మోత, మరో వైపు విద్యార్థులకు కావాల్సిన సామగ్రి పేరిట యాజమాన్యాలు చేస్తున్న వసూళ్లతో పేద, మధ్య తరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థికభారం పడుతోంది.

అమలుకు నోచుకోని జీవో..

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు తప్పకుండా ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. పాఠశాలలకు సంబంధించిన నియమ, నిబంధనలను పొందుపరిచి జీవో నం.1ను ప్రభుత్వం తీసుకొచ్చింది. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అమలుకు నోచుకోవడం లేదు. ఈ జీవో ప్రకారం పాఠశాలల్లో పారిశుధ్యం, అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ సేఫ్టీ, అద్దె భవనాలైతే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, ఆయా పాఠశాలలకు ప్రభుత్వ గుర్తింపు, స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వంటివి తప్పకుండా ఉండాలి. కానీ జిల్లాలోని అనేక పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలు అమలు కావడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

అధిక ఫీజులు అరికట్టాలి



ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. వాటి దోపిడీని అరికట్టాలి. నిబంధనలకు విరుద్ధంగా స్కూళ్లను ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నాయి. ఆయా పాఠశాలల్లో అర్హత లేని ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. విద్యాశాఖ దీనిపై దృష్టి సారించాలి.

– కార్తీక్, డీవైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు విక్రయించడం చట్టవిరుద్ధం. నిబంధనల మేరకే స్కూళ్లలో ఫీజులు వసూలు చేయాలి. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలపై చర్యలు తీసుకుంటాం.

– అశోక్, డీఈవో

వార'సంత'పై పట్టింపేది?

- కానరాని మౌలిక వసతులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- 'ప్రైవేట్' చేతుల్లో సంత నిర్వహణ



మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వారసంత

తిర్యాణి: మండల కేంద్రంలో ప్రతీ శుక్రవారం నిర్వహించే వారసంతలో మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. దీంతో వారసంతకు వచ్చే ప్రజలు నానా తిప్పలు పడుతున్నారు. వారానికి సరిపడా కూరగాయలు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు ఆయా మండల కేంద్రాల్లో, గ్రామాల్లో సంబంధిత గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో సంతలు నిర్వహిస్తున్నారు. కానీ మండలంలో వారసంత ఏర్పడి దాదాపు పదేళ్లు కావస్తున్నా నేటికీ సంత నిర్వహణ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోనే ఉంది.

కానరాని వసతులు

మండల కేంద్రంలో నిర్వహించే వారసంతకు ప్రతీ వారం వందల సంఖ్యలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు వచ్చి సరుకులు, కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు. కానీ పంచాయతీ అధికారులు సంత అభివృద్ధిని పట్టించుకోక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంత నిర్వహణకు అధికారులు ప్రభుత్వ స్థలం చూపకపోవడంతో ప్రైవేట్ వ్యక్తికి చెందిన స్థలంలోనే సంత నిర్వహణ కొనసాగుతోంది. దీంతో సదరు భూ యజమాని సంతలో ఏర్పాటు చేసే ప్రతీ దుకాణం నుంచి వారానికి రూ. 50 చొప్పున వసూళ్లు చేస్తున్నారు. కానీ మౌలిక సదుపాయాలు మాత్రం కల్పించడం లేదు. దీంతో వానాకాలం, ఎండాకాలంలో సరుకులు అమ్మేవారు నిలువ నీడ లేక అష్టకష్టాలు పడుతున్నారు. వీటితో పాటు మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

ఆదాయం కోల్పోతున్న పంచాయతీ..

సాధారణంగా గ్రామపంచాయతీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులతో పాటు ఇంటి పన్నులు, ఆయా గ్రామాల్లో నిర్వహించే వారసంతల ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుంది. కానీ మండల కేంద్రంలో పంచాయతీ ఆదాయానికి గండి పడుతోంది. ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో సంత నిర్వహణ ఉండడంతో గ్రామపంచాయతీకి ఏడాదికి దాదాపు రూ.లక్ష వరకు ఆదాయం కోల్పోతుంది. గ్రామ పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ భూమిలో సంత నిర్వహణ జరపాలని, కుదరని పక్షంలో ప్రస్తుతం సంత నిర్వహణ చేపతున్న స్థలాన్ని పంచాయతీ లీజుకు తీసుకొని వసతులు కల్పించాలని మండలవాసులు డిమాండ్ చేస్తున్నారు.

జీపీ ఆధ్వర్యంలో వారసంత నిర్వహించాలి



ప్రతీ శుక్రవారం నిర్వహించే వారసంతను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించాలి. ప్రస్తుతం సంత నిర్వహిస్తున్న స్థలాన్ని లీజుకు తీసుకోవాలి. సంత నిర్వహణ ద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం వస్తుంది. వచ్చే ఆదాయంతో సంతలో మౌలిక సదుపాయాలు కల్పించాలి.

– గెడం సుభాశ్, తిర్యాణి

సీనియర్ సిటిజన్స్ సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

కాగజ్‌నగర్‌టౌన్: సీనియర్ సిటిజన్స్ సమస్యలు పరిష్కరించాలని సీనియర్ సిటిజన్స్, విశ్రాంత ఉద్యోగులు డిమాండ్ చేశారు. వయోధికుల వేధింపుల అవగాహన వారోత్సవాల్లో భాగంగా సోమవారం కాగజ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీనియర్ సిటిజన్స్ సమస్యలు పరిష్కరించాలని, డేకేర్ సెంటర్స్, వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలని, వేధింపులు నివారించాలని కోరారు. ఈ సందర్భంగా మాస పత్రికను ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు పూర్ణ చందర్‌రావు, మురళీధర్‌రావు, శివప్రసాద్, సుభాశ్, బవండ్లపెల్లి నర్సయ్య, సునీల్, పురుషోత్తం, మహబూబ్, రామయ్య, రామరాజు, రాజయ్య, షణ్ముఖ చారి, నర్సయ్య పాల్గొన్నారు.

ఈహెచ్‌ఎస్ అమలు చేయాలని వినతి

ఆసిఫాబాద్: పూర్తిస్థాయిలో ఈహెచ్‌ఎస్‌ను తమకు అమలు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సదానందం, జిల్లా నాయకులు గుర్రాల వెంకన్న మాట్లాడుతూ పీఆర్సీ కమిటీని వెంటనే ఏర్పాటు చేసి జూలై 1, 2023 నుంచి అమలు చేయాలన్నారు. ఐఆర్ ప్రకటించాలని, కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లతో సమానంగా పెండింగ్‌లో ఉన్న డీఆర్‌లను తక్షణం విడుదల చేయలని డిమాండ్ చేశారు. సంఘం ప్రతినిధులు పుల్లూరు కిష్టయ్య, మధుసూదన్ గౌడ్, సిరాజ్ ఉల్ హుక్, రమేశ్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని హైకాజీనగర్‌లో చినుకుపడితే చాలు డ్రెయినేజీ నీరు రోడ్లపై పారుతోంది. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది ప్రారంభించిన డ్రెయినేజీ పనులు పూర్తి కాకపోవడంతో వర్షాకాలంలో కాలనీ పరిస్థితి అధ్వానంగా మారుతోంది. తారకరామానగర్, జన్కాపూర్, బజార్‌వాడీల్లో కూడా పరిస్థితి దారుణంగా ఉంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆడే ప్రకాశ్

కెరమెరి: మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. సోమవారం మండలంలోని ఝరి ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో కూరగాయలు శుభ్రంగా కడగాలని, పరిశుభ్రంగా ఉన్న చోటే వంటలు చేయాలన్నారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను చదివించారు. సర్పంచ్ న్యానేశ్వర్, హెచ్‌ఎం సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

'రైతులను మోసం చేస్తే చర్యలు'



ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న పవన్‌కుమార్

నార్నూర్: నకిలీ విత్తనాల పేరుతో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, లైసెన్స్ రద్దు చేస్తామని వ్యవసాయ శాఖ అధికారి పవన్ కుమార్ అన్నారు. సోమవారం జైనూర్ మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్స్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాల పేరుతో రైతులు మోసపోవద్దన్నారు. ప్రభుత్వ అనుమతి ఉన్న ఫర్టిలైజర్ దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత రైతులు రశీదు తీసుకోవాలని పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పర్యటన

బెజ్జూర్: సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మంగళవారం మండల కేంద్రంలో పర్యటించనున్నట్లు జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, ఎంపీపీ డోకె రోజారమణి వెంకన్న, కో ఆప్షన్ సభ్యులు బషారత్ ఖాన్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సిడాం సకారాం, పీఏసీఎస్ చైర్మన్ కుర్సింగ ఓంప్రకాష్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీన సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన నేపథ్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

కౌటాల: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, పార్టీ మండలాధ్యక్షుడు ఆదే వసంత్‌రావ్ సోమవారం తెలిపారు. ఈనెల 30న సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన నేపథ్యంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

నేడు ప్రత్యేక సమావేశం

కెరమెరి: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు పంచాయతీ గ్రామ కార్యదర్శులు, ఉపాధిహామీ టీఏ, ఎఫ్‌ఏలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, ఎంపీవో సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ రుణాలు, హరిత హారం, అటవీహక్కు పత్రాల లబ్ధిదారులు, డ్రైడే యాక్టివిటీస్, వైకుంఠధామాల్లో విద్యుత్ సౌకర్యం తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలి



బంద్ పాటించాలని వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దహెగాం: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏబీవీపీ ఇచ్చిన బంద్ పిలుపు మేరకు బీబ్రా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను ఏబీవీపీ నాయకులు మూసి వేయించారు. పాఠశాల బంద్ చేయాలని వినతిపత్రం అందజేశారు. సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. శ్రీకాంత్, సురేశ్, మహేశ్, విద్యాసాగర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మండలం అందవెల్లి గ్రామానికి చెందిన పేద విద్యార్థి ఆదే అశ్విత్‌కు హైదరాబాద్ మసబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాలలో సీటు రాగా ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం ఎమ్మెల్యే నివాసంలో అశ్విత్ ఉన్నత చదువుల కోసం రూ.15వేలు అందజేశారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వోరగంటి వరప్రసాద్, మాజీ జెడ్పీటీసీ మౌల్కర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

భోజన కార్మికుల వేతనం చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాన్ని వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల క్రిష్ణమాచారి అన్నారు. కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో సిబ్బంది సుమన్, లులాజీకి వినతిపత్రం అందించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు హంస, శారద, మధునక్క, పార్వతి, విమల, ఇందిరా, కమల, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు.. ప్రయాణికుల తిప్పలు



గుంతలో నిలిచిన వర్షపు నీరు

- నిలిచిన వర్షపు నీరు
- పట్టించుకోని అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: ఐదు మండలాల ప్రజలు నిత్యం ప్రయాణించే ప్రధాన రహదారి గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం ప్రధాన చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై గుంతలు పడడంతో వాహనదారులు, ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు గుండానే అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం ప్రయాణం చేస్తున్నా గుంతలు పూడ్చడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రస్తుతం గుంతల్లో వర్షపు నీరు చేరడంతో ప్రయాణికులు మరింత ఆందోళన చెందుతున్నారు.

రద్దీగా రోడ్డు..

మండలంలోని ఈజ్‌గాం మూలమలుపు వద్ద రహదారి గుంతలతో ప్రమాదకరంగా మారింది. ఈ మార్గం గుండా పెంచికల్‌పేట్, కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి, దహెగాం మండలాలతో పాటు కాగజ్‌నగర్ మండలంలోని పలు గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. వర్షం కురిసినప్పుడు గుంతల్లో మోకాలు లోతులో నీరు చేరుతుండడంతో పాటు రోడ్డంతా బురదమయంగా మారుతోంది. నీరు నిలిచి ఉండటంతో వాహనదారులు అదుపు తప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. అధికారులు పట్టించుకోకుండా వ్యవహరిస్తుండడంతో ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



అధికారులు రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. కాగజ్‌నగర్‌కు వెళ్లాలంటే ఈ మార్గం గుండానే ప్రయాణిస్తుంటాం. రోడ్డు గుంతలమయంగా మారడంతో ఇబ్బందులకు గురవుతున్నాం.

– కర్నె నగేశ్, సారసాల

అధికారులు స్పందించాలి



అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి. పెద్ద ప్రమాదాలు జరగకముందే పనులు చేయాలి. ఈ రోడ్డు గుండా నిత్యం ఐదు మండలాల ప్రజలు ప్రయాణం చేస్తుంటారు.

– లొనారె రవీందర్, ఈజ్‌గాం

మానసిక ఆరోగ్యంపై అవగాహన

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నపూర్ణ వసతి గృహంలో డిగ్రీ విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై సోమవారం అవగాహన కల్పించారు. టీపీఏ జిల్లా అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జీవితంలో కష్టసుఖాలు, సమస్యలు సర్వ సాధారమైనవన్నారు. ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని చక్కటి జీవితాన్ని ఏర్పర్చుకోవాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణరావు, క్లినికల్ న్యూట్రిషన్ మహతి శ్రీ, రిటైర్డ్ ఎంఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.